క్లుప్తంగా

27న మున్సిపల్ సమావేశం

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈ నెల 27న మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ శనివారం ఒకప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి పాలక వర్గ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: నల్లగొండలో ఆదివారం 11కేవీ లైన్ పనులు జరిగే ప్రాంతాల్లో ఉదయం 10:00 గంటల నుంచి 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నవీద్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దారుషఫాకాలనీ, భారత్ గ్యాస్ ఏరియా, గవర్నమెంట్ హాస్పిటల్‌రోడ్డు, బస్టాండ్ ప్రాంతం, డాక్టర్స్, అన్సారీ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ కాలనీ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రీన్ గ్రోవ్ విద్యార్థుల ర్యాలీ



చిట్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రీన్ గ్రోవ్ విద్యార్థులు

చిట్యాల: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనను నిరసనగా చిట్యాలలో గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కఠిన చట్టాలను తీసుకురావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సెమ్ ఒలింపియాడ్'లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన చిట్యాల ఠాగూర్ విద్యాలయం విద్యార్థులు

చిట్యాల: పట్టణంలోని ఠాగూర్ విద్యాలయానికి చెందిన పలువురు విద్యార్థులు ఇటీవల నిర్వహించిన సెమ్ (సైన్స్, ఇంగ్లిష్, మ్యాథ్స్) ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పెద్ది నరేందర్ తెలిపారు. పాఠశాలకు చెందిన పొట్లపల్లి సాయి యశ్వంత్ రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం, పి.గాయత్రి ఎనిమిదో స్థానం సాధించారని తెలిపారు. జోనల్ స్థాయిలో సిద్ధార్థ, ఆదీభ, తేజశ్రీ, వెన్నల ప్రతిభ చూపారని తెలిపారు. ఆ విద్యార్థులను ఆ పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాల ఆవరణలోని బురదగుంట చదును



కేతేపల్లి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో మట్టి పోయిస్తున్న అధికారులు

కేతేపల్లి: కేతేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 'బురద మడుగులా పాఠశాల ఆవరణ' అనే శీర్షికన సాక్షి పత్రికలో ఇటీవల ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. లోతట్టుగా ఉన్న పాఠశాల ఆవరణలో శనివారం అధికారులు మట్టి పోయించి గుంతలను చదును చేశారు. వర్షపు నీరు సాఫీగా బయటికి వెళ్లేలాచర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరావు, ఎంపీడీవో బి.శ్రీనివాస రావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి పట్టణంలో నలంద పాఠశాల 2002–2003లో 10వ తరగతి చదువుకున్న స్నేహితుడు ఎండి ఆజంఖాన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు శనివారం ఆజంఖాన్‌కు రూ.45ల నగదు అందజేశారు. వారిలో గుంటోజు రమేష్, ప్రతికంఠం ప్రేమ్‌చందర్ రాజు, చిలక శ్రీను, శిరిగమల్ల రాజు, పేర్ని సబిష్, బొబ్బలి మధు, రాములు ఉన్నారు.

నకిరేకల్ : మున్సిపాలిటీలోని 12వ వార్డుకు చెందిన వినయ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్థానిక కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ శనివారం సందర్శించి నివాళులర్పించారు. నాగయ్యగౌడ్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేల నగదు అందజేశారు. నివాళులర్పించిన వారిలో వార్డు కౌన్సిలర్ బానోతు వెంకన్న, మాచర్ల సైదులు, గుడుగుంట్ల బుచ్చిరాములు, యేశబోయిన కొమరయ్య, వంటిపాక వెంకన్న పాల్గొన్నారు.

రూ.216కోట్లు.. 185 కిలోమీటర్లు..

నీలగిరిలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం

- తీరనున్న మురుగు నీటి సమస్య
- ఏడాదిన్నరలో పనులు పూర్తి చేస్తామంటున్న మున్సిపల్ చైర్మన్



నీలగిరిలోని 18వ వార్డు శ్రీనగర్ కాలనీలో సాగుతున్న యూజీడీ పనులు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణ ప్రజలను వేధిస్తున్న మురుగునీటి సమస్య త్వరలోనే తీరనుంది. కొన్నేళ్లుగా శివారు కాలనీల్లో మురుగు నీరు సాఫీగా పోవడానికి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. అమృత్ 2.0 కింద పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు 18, 19వ వార్డుల్లో ఇటీవల ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఇప్పటి వరకు లేని కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టనున్నారు. అమృత్ స్కీం కింద పట్టణంలో యూజీడీ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 216 కోట్లు మంజూరు చేసింది. దాంతో టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులు మొదలు పెట్టారు. కాలనీల్లో యూజీడీ పనులు పూర్తయితే మురుగు నీరు రోడ్లపై పారకుండా భూగర్భం నుంచి వెళ్తుంది. ఇక నుంచి ఇంటి పక్కను కూడా మురుగు నిలిచిపోయి దుర్వాసన, దోమలు, పందుల లాంటి సమస్యలు తప్పే అవకాశం ఉంటుంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంతో ఎక్కడ కూడా అందులో ప్లాస్టిక్ వస్తువులు, ఇతర చెత్త, చెదారం కూడా వేసే అవకాశం ఉండదు. మురుగు నీటికి అవాంతరాలు లేకుండా దిగువకు వెళ్లనుంది.

తప్పనున్న వరద ముప్పు

శివారు ప్రాంతాల్లోని కొన్ని కాలనీల్లో లోతట్టు కారణంగా భారీ వర్షాలు వచ్చినప్పుడు ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద నీటితో తీవ్రంగా నష్టం జరుగుతుంది. మట్టి రోడ్లు కోతలకు గురి కావడం, ఎక్కడి నుంచి పడితే అక్కడి వరద నీరు పోతుండడంతో కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం పూర్తయితే కాలనీలకు వరద ముప్పు తప్పనుంది. మురుగు నీరు, వర్షపు కలిసి కాలనీల్లో వరద ప్రవాహం పారేది.

గడువులోగా పూర్తి చేస్తాం



అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఇప్పటికే మొదలు పెట్టాం. నాణ్యత విషయంలో రాజీపడేదిలేదు. ప్రతి పని నాణ్యతతో చేపట్టాలని, అధికారులు ఆకస్మిక తనిఖీ చేయాలని ఆదేశించాం. యూజీడీ పనులు గడువు కన్నా ముందుగానే పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.

– బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్

యూజీడీ పనులు పూర్తయితే ఆయా వార్డుల్లో వరద ముప్పు తగ్గే అవకాశం ఉంది.

ఏడాదిన్నరలో యూజీడీ పనులు

ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం ముందుకు పోవాలని నిర్ణయించారు. రూ. 216 కోట్లతో పట్టణంలో 185 కిలో మీటర్ల మేర కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపడుతున్నారు. దీని నిర్మాణం కారణంగా మెజార్టీ వార్డులకు యూజీడీ కవర్ కానుంది. ఏడాదిన్నర కాలంలో ఈ పనులు చేసేందుకు గడువు ఉంది. గడువులోగానే పనులు పూర్తి చేయాలని స్థానిక మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దాంతో అధికారులు, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పనులు వేగవంతంగా చేపట్టి గడువు కన్నా ముందుగానే పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు.

గీత కార్మికులకు రక్షణ మోకులపై శిక్షణ



మోకులపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ

నల్లగొండ రూరల్: గీత కార్మికులు కాటమయ్య రక్ష సేఫ్టీ మోకులను సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌గౌడ్ అన్నారు. శనివారం నల్లగొండ మండలంలోని అప్పాజీపేటలో కాటమయ్య రక్షా సేఫ్టీ మోకులపై శిక్షణనిచ్చారు. ఎంతో మంది గీత కార్మికులు సరైన జాగ్రత్తలు తీసుకోకుండా చెట్టుపై నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోతున్నారని, ఫలితంగా వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోకులు అందజేసేందుకు కృషిచేసిన ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ విజయ్, గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, సొసైటీ అధ్యక్షుడు నగేష్‌గౌడ్, రాపర్తి సతీష్‌గౌడ్, కల్లూరి సైదులుగౌడ్, అమరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, పోలీసులు

తిప్పర్తి : మండల సమాఖ్య, తిప్పర్తి పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి నిర్మూలనపై శనివారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ దుర్గారెడ్డి, ఏపీఎం శ్రీదేవి మాట్లాడుతూ గంజాయి వాడకం వలన యువత భవిష్యత్తును కోల్పోతున్నారని, భావిభారత పౌరులుగా ఎదగాల్సిన యువత చెడుమార్గం ఎంచుకొని తప్పుదోవ పడుతున్నారని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు సమాజంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తే ఫోన్ చేయండి

చండూరు : గంజాయి సేవించినా..సరఫరా చేసినా టోల్‌ఫ్రీ నంబర్ 8712670266కు ఫోన్ చేయాలని పోలీసులు గ్రామాల్లో ముఖ్య కూడళ్లలోని గోడలపై రాయించారు. ఫోన్ చేసిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు.

అంబులెన్స్ తనిఖీ

తిప్పర్తి : తిప్పర్తి మండలానికి చెందిన 108 అంబులెన్స్ వాహనాన్ని ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ మధు శనివారం మండల కేంద్రంలో తనిఖీ చేశారు.రికార్డులు ,మెడికల్ కిట్‌లు, వాహనం కండిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రశేఖర్, సక్రియ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



నకిరేకల్ : మాట్లాడుతున్న కందాల ప్రమీలా

నకిరేకల్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీలా కోరారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ తన పొలిటికల్ మైలేజ్ కోసం రుణమాఫీ ప్రకటించి నేడు సీఎంతో పాటు మంత్రుల అబద్ధపు ప్రచారాలు చేసుకుంటున్నారని అన్నారు. సమావేశంలో రాచకొండ వెంకట్ గౌడ్ వంటిపాక వెంకటేశ్వర్లు, నాయకులు వంటిపాక కృష్ణ, జిల్లా ఉపేందర్, పాలడుగు రమేష్, ఎరుకులి అంజయ్య పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ గందరగోళం

మర్రిగూడ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని గందరగోళంగా మార్చిందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాసాల వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు ఎడ్ల కాశయ్య, కత్తి సత్తిరెడ్డి, సత్తిరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలని ధర్నా

తిప్పర్తి : ఇచ్చిన హామీ ప్రకారం రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నన్నూరి వెంకటరమణారెడ్డి మాటాడారు.అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మన్నెం భిక్షం, బీమగాని గణేష్, పొకల శశిధర్, గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

నార్కట్‌పల్లి: రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రుణాలు మాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల వ్యవసాయ అధికారికి తెలంగాణ రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, చింతపల్లి బయన్న, కోప్పు శ్రవణ్‌కుమార్, దండు రవి, అర్థం శ్రీను,తదితరులు ఉన్నారు.

శాలిగౌరారం: కాలపరిమితి లేకుండా రైతులందరికీ రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆపార్టీ నాయకులు అల్లి రాములు, తోట వినోద్, బాషబోయిన వెంకన్న, సయ్యద్, గోదల సురేశ్‌రెడ్డి, నిమ్మల సురేశ్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

మర్రిగూడ : ఉపాధిహామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నరసింహ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి తక్కువ నిధులు కేటాయించిందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీలకు వేతనాలను పెంచాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలకృష్ణ, గొల్కొండ లింగయ్య, జానిమియా, ఊశయ్య, భిక్షంరెడ్డి, బూడిద సురేష్, జక్కలి అంజయ్య, అబ్బనగోని యాదయ్య పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శనివారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నిజాంపేట్, బాచుపల్లి, గాంధీనగర్ కాలనీకి చెందిన టాస్‌లే నర్సింహ, నల్లగంటి భీమరాజు, శివకోటి ఉమామహేష్, కర్ణాటకకు చెందిన గోవింద్‌సింగ్ కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి సమీపంలోని గోకవరం వద్ద 163 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన గంజాయిని 81 ప్యాకెట్లలో ఉంచి రెండు కార్లలో కర్ణాటకకు బయల్దేరారు. గంజాయి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు తిప్పర్తి పోలీసులు తిప్పర్తిలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టి వీరి కారును ఆపారు. నలుగురిని విచారించగా గంజాయిని కర్ణాటకకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన తమన్, ప్రహ్లాద్ తాము గంజాయి తీసుకెళ్తే ఒక్కొక్కరికి ట్రిప్పుకు రూ.20వేల చొప్పున ఇస్తారని పోలీసులకు వెల్లడించారు. ప్రహ్లాద్, తమన్ పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. కేసును చేధించిన సిబ్బంది రాజు, రాజీవ్, ముజీబ్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ మహేందర్, రామకృష్ణను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ రాజు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన రిలే దీక్షలు

చండూరు(గట్టుప్పల్) : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం ముగిశాయి. చివరి రోజు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు రాములుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండ శ్రీశైలం, కర్నాటి మల్లేశం, శివకుమార్, కర్నాటి సుధాకర్, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం ఉన్నారు.

రాచకాల్వలో రైతుల శ్రమదానం

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వ రామన్నపేట మండలం తుర్కపల్లి వద్ద ధ్వంసమైంది. అక్కడి తూముల నుంచి వృథాగా పోతున్న వరదనీటిని రామగిరి, శాలిలింగోటం, గురుజాల గ్రామాలకు చెందిన రైతులు శనివారం శ్రమదానం చేసి అరికట్టారు. ప్రాజెక్టు ఆయకట్టు రైతు చామల వెంకటరమణారెడ్డి నేతృత్వంలో తూముల వద్ద గడ్డికట్టలు, ఇసుక బస్తాలు అడ్డుగా వేసి నీటివృథాను నిరోధించారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

మర్రిగూడ: జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టాఫ్ సివిల్ సప్లయాస్ నాంపల్లి, నల్లగొండ ఆర్ఐలు సైదులు, లింగస్వామి శనివారం మర్రిగూడ మండలం శివన్నగూడ, మర్రిగూడ పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపట్టారు. పెట్రోల్ బంకుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

చిట్యాల: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26, 27,28వ తేదీల్లో జరగనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి కోరారు. చిట్యాల మండల నేరడ గ్రామంలో శనివారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కల్లూరు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రెడపాక మల్లయ్య, సహాయ కార్యదర్శి లోడే విష్ణు,లడే రాములు పాల్గొన్నారు.

రామచంద్రం సేవలు మరువలేనివి

చిట్యాల: పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పనిచేసిన వట్టిమర్తి గ్రామ సర్పంచ్ రాచమల్ల రామచంద్రం సేవలు మరువలేనివని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాలలో శనివారం నిర్వహించిన వట్టిమర్తి మాజీ సర్పంచ్ రాచమల్ల రామచంద్రం సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, తుమ్మల వీరారెడ్డి, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, బొజ్జ చినవెంకులు, మల్లం మహేష్, మండల కార్యదర్శులు అర్రూరి శ్రీను, చెరుకు పెద్దులు, మండల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కోలాహలంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు





నల్లగొండలోని శ్రీచైతన్య స్కూల్‌లో శ్రీకృష్ణుని వేషధారణలో విద్యార్థులు, ఎస్పీఆర్ స్కూల్‌లో...

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని సాగర్ ఎక్స్ రోడ్‌లో గల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిని, విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఉత్సాహంతో ఉట్లు కొట్టారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సీహెచ్ యాదయ్య, యాస శ్రీనివాసరెడ్డి, గడ్డం త్రిమూర్తి,నాగేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని కృష్ణవేణి, మాస్టర్ మైండ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు కోలాహలంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారులతో ఉట్లు కోట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ సంధ్య, కనుకుట్ల సునీత వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

చిట్యాల: పట్టణంలోని లయోలా టెక్నో స్కూల్, వెలిమినేడు గ్రామంలోని విజయవాణి హైస్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడిగా, గోపికల వేషధారణలో అలరించారు. కార్యక్రమాలలో ఆయా పాఠశాల ప్రిన్సిపాల్ జమీరొవద్దీన్, వలిగొండ శంకర్, కరస్పాండెంట్ అర్రూరీ రాజు, డైరెక్టర్‌లు కిరణ్, వెంకన్న, శ్రవణ్, ఉపాధ్యాయులు మధు, రాజు, సాయి, జానకి, స్వరూప, సంగీత, సుజాత, స్రవంతి, మాధవి, ప్రవళ్లిక, ఇందిరా, సుమలత పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు : స్థానిక సన్‌షైన్ హైస్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులు గోపిక, శ్రీకృష్ణుని వేషధారణతో నృత్య ప్రదర్శనలు, కోలాటాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న, డైరెక్టర్ కోడి సుష్మ , ప్రిన్సిపాల్ రవికాంత్, లతీఫ్ పాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిట్యాల : లొయోలా టెక్నో స్కూల్‌లో..



చండూరు సన్‌షైన్ పాఠశాలలో..



శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారి



శ్రీకృష్ణుడి వేషధారణలో..



నకిరేకల్ : కృష్ణవేణి పాఠశాలలో..



కట్టంగూరు : సాందీపని స్కూల్‌లో..



చిన్ని కృష్ణుడిగా..

ఓటరు సవరణ పూర్తి చేయాలి



బీఎల్ఓలకు సూచనలు చేస్తున్న నియోజకవర్గ ట్రైనర్ బాలరాజు

మర్రిగూడ : గ్రామాల్లోని ఓటర్ల జాబితా సవరణను బీఎల్ఓలు సకాలంలో పూర్తి చేయాలని నియోజకవర్గ స్థాయి అధికారి(ఏఎల్ఎంటీ) బాలరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్‌వోలకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించి మాట్లాడారు. బీఎల్‌వోలు ఈ సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీడీవో జి.చినమునయ్య, డీటీ జూటూరు తారకరామన్ పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

చండూరు(గట్టుపల్) : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ రాములు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్టోరల్ రోల్స్ ఎస్ఎస్ఆర్ 2025 బూతు లెవెల్ ఆఫీసర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్ బాబు, ట్రైనర్స్ శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, బిఎల్‌వోలు పాల్గొన్నారు

ఓటు నమోదుపై శిక్షణ

తిప్పర్తి : అర్హులైన యువతి ,యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకునేలా చైతన్యపర్చాలని తిప్పర్తి ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్ఓలు, బూత్‌లెవల్ సూపర్‌వైజర్‌ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఆబేదాబేగం, ఎంపీఓ జానయ్య, మాస్టర్ ట్రైనర్‌లు చిట్టిప్రోలు సదానందం, శ్రీనివాస్‌రావు, నిమ్మల వెంకన్న పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



రోడ్డుపై గుంతల్లో మట్టిపోస్తున్న నాయకులు

మునుగోడు: మండల కేంద్రంతో పాటు మునుగోడులోని పలు వీధులు, రహదారులల్లో ఉన్న గుంతలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి శనివారం పూడ్చివేయించారు. ప్రధానంగా మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని సానబండ రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన నిధులతో మట్టి పొయించి చదును చేయించారు. దీంతో ఎమ్మెల్యేకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

'మేలుకొలుపు' పోస్టర్ విడుదల

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సెప్టెంబర్ 1న చేపట్టబోయే మేలుకొలుపు యాత్ర ప్రచార పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి,మాదగి జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, విద్యార్థి జేఏసీ కన్వీనర్ మీసాల మహేష్, దేవరకొండ నరేష్, గణేష్, సంతోష్, శ్రీరామ్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

మహిళల భద్రతకే షీ టీమ్స్

కనగల్ : మహిళల భద్రతకే షీటీమ్స్ పనిచేస్తున్నాయని చినమాదారం ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మ, షీటీమ్ ఏఎస్ఐ ఉపేందర్ అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. షీ టీమ్స్ విద్యార్థినులకు, మహిళలకు రక్షణ కవచంగా పనిచేస్తాయన్నారు. ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అటెండర్‌కు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన కాడింగు బాలనర్సింహ చిన్నపురి గ్రామంలోని పోస్‌పాల్ 6వ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పనిచేసేవాడు. అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆపాఠశాల 1998–99 పదవ తరగతి విద్యార్థులు శనివారం అటెండర్‌కు రూ.20వేలను అందజేశారు. కార్యక్రమంలో జానీపాష, శంకర్, శ్రీనివాసరెడ్డి, పరమేశ్వర్, మధుసూధన్‌రెడ్డి, సైదిరెడ్డి, విజయలక్ష్మి, స్వప్న, శ్యామల, అమృత, ఆనంద్ ఉన్నారు.

డీపీఆర్ ఆమోదించేంత వరకు పోరాటం ఆగదు

మర్రిగూడ : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ప్రభుత్వం ఆమోదించేంత వరకు పోరాటం ఆగదని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించి డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు.